క్లుప్తంగా

మార్చి 31 నాటికి దాళ్వా సాగు పూర్తి చేయాలి

కాజులూరు: వచ్చే మార్చి 31 నాటికి రైతులు దాళ్వా సాగును పూర్తి చేయాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. మండలంలోని శలపాకలో సోమవారం స్థానిక అధికారులు, రైతులకు సమావేశం ఏర్పాటు చేసి పంటల సాగు, కాలమార్పులపై అవగాహన కలిగించారు. తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31 నాటికి గోదావరి డెల్టా కాలువలకు నీరు నిలుపుదల చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నిర్ణీత సమయంలో పంట పూర్తవ్వాలంటే ఈ పాటికే దాళ్వా వెదచల్లికలు, నాట్లు పూర్తై ఉండాలన్నారు. అయితే ఈ ఏడాది వర్షాల కారణంగా జాప్యం జరుగుతుందని కనీసం ఈ నెలాఖరు నాటికైనా పూర్తి స్థాయిలో వెదచల్లికలు, నాట్లు పూర్తి చేయాన్నారు. సాగుకు సమయం తక్కువ ఉన్నందున రైతులు వెదచల్లిక విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని తక్కువ రోజుల్లో కోతకు వచ్చే వరి వంగడాలను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ శ్రీను, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి అనూష, పెద్దకాపు, పలువురు రైతులు పాల్గొన్నారు.

గని పోతురాజు ఆలయ ఆవరణ అభివృద్ధి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరంలోని గని పోతురాజు ఆలయ ఆవరణను గ్రావెల్‌తో చదును చేయిస్తున్నారు. ఆలయం వెనుకు, ముందర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో చేపట్టిన ఈ పనులను ఉత్సవ కమిటీ చైర్మన్ కూసు నరసింహమూర్తి, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, దూలం వెంకన్నబాబు రెండు రోజులుగా పర్యవేక్షిస్తున్నారు. సలాది శివ, బందెల సాయిరామ్, అబ్బిరెడ్డి వీర్రాజు, పురంశెట్టి శ్రీను, చంద్రమళ్ళ యెషయ్య పరిశీలించారు.

వ్యాఘ్రేశ్వరునికి లక్ష బిల్వార్చన



స్వామికి సమర్పించిన టేకు తలుపులు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో వేంచేసిన వ్యాఘ్రేశ్వర స్వామికి సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

టేకు ద్వారాల సమర్పణ

పుల్లేటికుర్రులో వేంచేసిన బాలాత్రిపురసుందరి సమేత వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో ఉన్న స్వామి అంతరాలయం వద్ద టేకు ద్వారాలను పిల్లాడి శ్రీనివాసు సోమవారం సమర్పించారు. రూ.లక్ష విలువ చేసే టేకు అంతరాలయం ద్వారాలు, తలుపులు అందజేశారు. అంతకు ముందు టేకు తలుపులకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి అనుగ్రహంతో తన కుమారుడికి ఉద్యోగం వచ్చినందుకుగాను స్వామికి టేకు తలుపులు పంపిణీ చేయించినట్లు భక్తుడు శ్రీనివాస్ తెలిపారు.

ప్రభల ఉత్సవాన్ని విజయవంతం చేద్దాం

అంబాజీపేట: ఏటా కనుమ రోజున మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించే ప్రభల ఉత్సవాన్ని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరం కలసికట్టుగా విజయవంతం చేద్దామని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఏఓ బి.వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నారు. మొసలపల్లిలో వేంచేసిన భోగేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో 11 గ్రామాలకు చెందిన ప్రభల ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు సోమవారం సమావేశమయ్యారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభల తీర్థానికి సంబంధించి 11 గ్రామాలకు చెందిన నిర్వాహకులతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. తీర్థంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ప్రభల కమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకుని భక్తులకు సహకరించాలన్నారు. తీర్థంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. సమావేశంలో దంతులూరి శ్రీనివాసరాజు, సూర్యారావు, సతీష్‌రాజు, మోహనరాజు, కృష్ణంరాజు, శ్రీపాద వెంకటరమణ, అర్చకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి జారి పడి తాపీమేస్త్రి మృతి



ప్రతాప్ (ఫైల్)

రాజోలు: మూడంతస్తుల భవనంపై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి బి.సావరం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి కొణతం ధనగంగా ప్రతాప్(44) మృతి చెందాడు. సోమవారం ప్రతాప్ కుటుంబాన్ని నాయకులు కడియం పూర్ణచంద్రరావు, కంచి వెంకటరమణ, కుంపట్ల చిన్నారి తదితరులు పరామర్శించారు. ఈ నెల 23న స్థానిక తాపీమేస్త్రీల సంఘ భవన సమీపంలో గారపాటి వీరబాబుకు చెందిన మూడంతస్తుల భవన నిర్మాణానికి వెళ్లాడు. అక్కడ మూడో అంతస్తు వద్ద పరంజీపై నిలబడి పని చేస్తుండగా ప్రతాప్ ప్రమాదవశాత్తూ జారి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కాగా రాజోలు ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించగా అప్పటికే ప్రతాప్ మృతి చెందాడని వైద్యులు ధృవీకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు.



అముజూరు మన్నా చర్చిలో క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



కాజులూరు మండలం, గొల్లపాలెం చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



మండపేటలో క్రిస్మస్ వేడుకల్లో శ్రీకృష్ణను సత్కరిస్తున్న చర్చి ఫాదర్ జయబాబు తదితరులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాజులూరు: మండల గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. పలు చర్చిల్లో క్రీస్తు జన్మదినం పురస్కరించుకుని ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ చర్చిల్లో పాల్గొని క్రీస్తు జననంపై గీతాలు ఆలపించారు. క్రైస్తవులు ఏసుప్రభువు పుట్టినరోజు కేక్ కట్ చేసి భక్తులకు పంచారు. మండలంలోని గొల్లపాలెంలో సత్యసాయి భజన మండలి సభ్యులు వేకువజామున కొవ్వొత్తులతో నగరకీర్తన నిర్వహించి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్ని చర్చిలు క్రిస్మస్ శోభతో కళకళలాడాయి. ఆదివారం రాత్రి నుంచే ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఏసుక్రీస్తు జననంపై ఆయా ప్రార్థనా మందిరాల పాస్టర్లు సందేశమిచ్చారు. పిల్లలు, యువత, పెద్దవారితో చర్చిలు కిక్కిరిసిపోయాయి. కొవ్వొత్తుల చేతపట్టి మధుర గీతాలు ఆలపించారు. పాస్టర్లు, ప్రముఖులు కేట్ కట్ చేసి క్రిస్మస్ సుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు, యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వివిధ చర్చిల్లో శాంతాక్లాజ్‌లు సందడి చేశారు. క్రైస్తవ విశ్వాసులు క్రీస్తు జననానికి సూచికగా నక్షత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. మండలంలో అముజూరు మన్నా చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ ఫౌండర్ ఎం.జాన్‌బాబు మాట్లాడుతూ క్రీస్తు మార్గమే శాంతి మార్గం అని సందేశమిచ్చారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

శాంతి, ప్రేమ ఆప్యాయతల కలయిక క్రిస్మస్

రామచంద్రపురం: శాంతి, ప్రేమ, కరుణ, దయ, అనురాగాల ఆపాయ్యత కలయిక క్రిస్మస్ అని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులకు మంత్రి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ అంటే యేసు ప్రభువును జ్ఞాపకం చేసుకునే సమయమని, విశ్వవ్యాప్తంగా ప్రజలందరిలో ప్రేమ, సహనం, కరుణ పూర్వక అనుబంధాలను మేలుకొలుపుతూ యేసు బోధనలను ఆదరించి ధర్మం, విశ్వాసపూరిత గమనానికి యేసుక్రీస్తు జీవనం మనందరికీ ప్రేరణనిస్తుందని మంత్రి చెప్పారు. నా క్రైస్తవ సోదరులతో కలసి శాంతి, సామరస్యం కోసం ప్రార్థిస్తున్నానన్నారు. కరోనా ముప్పు మరోసారి పొంచి ఉందని ఆరోగ్య సంస్థలు హెచ్చరిస్తున్న తరుణంలో సామాజిక దూరాన్ని పాటించటం, మాస్క్ ధరించటం, తరచుగా చేతులు కడుక్కోవడం వంటి అన్ని జాగ్రత్తలు తీసుకుని సురక్షితంగా ఉంటూ పండుగను జరుపుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ సందర్భంగా మంత్రి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



రాయవరం మండలం పసలపూడి చర్చిలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు

రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు చర్చిల్లో సోమవారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని తాకాయి. అర్ధరాత్రి వరకు చర్చిల్లో క్రైస్తవులు క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యువతీయువకులు, చిన్నారుల కేరింతల మధ్య కేక్ కటింగ్‌లు, ప్రత్యేక గీతాల ఆలాపనలు, డ్యాన్స్‌లతో ఉత్సాహంగా గడిపారు. తోటపేటలోని రోమన్ కేథలిక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు పాస్టర్ జోసెఫ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామలోని గుడ్‌న్యూస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలోని చర్చిలో పాస్టర్ డాక్టర్ రెవరెండ్ జాన్‌బెన్నీ ఆధ్వర్యంలో విశ్వాసులు ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారు. పాస్టర్ జాన్‌బెన్నీ, ఉషారాణి దంపతులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపనయ్యచెరువు, మట్లచెరువు, ఆదివారపుపేట గ్రామాల సంఘస్తులు పాల్గొన్నారు.

మండపేట పట్టణం, మండలంలో..

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, న్యూలైఫ్ బాప్టిస్టు చర్చి, సెయింట్ మేరీస్ బాప్టిస్టు తదితర చర్చిలలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని ద్వారపూడి, అర్తమూరు, కేశవరం, ఏడిద, తాపేశ్వరం, జెడ్.మేడపాడు, మెర్నిపాడు, ఇప్పనపాడు, వేములపల్లి, వెలగతోడు, పాలతోడు, మారేడుబాక గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బైబిల్‌లోని వాక్యాలను క్రైస్తవ భక్తులకు వివరించారు. క్రైస్తవ గీతాలను ఆలపించారు. ఆలయాలు వద్ద క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి.

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణ 18వ వార్డు మఠం వీధిలోని హోలీ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చిలో సోమవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చి ఫాదర్ వాసంశెట్టి జయబాబు, కిరణ్ పాల్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చోడే శ్రీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణను చర్చి ఫాదర్ జయబాబు, క్రైస్తవ భక్తులు ఘనంగా సత్కరించారు. కోయల సతీష్‌గౌడ్, ఫణి, జాన్సన్, సాయి, డానియేల్‌రాజు, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



రాయవరం అపోస్థలిక్ చర్చిలో క్యాండిల్ సర్వీస్ చేస్తున్న క్రైస్తవులు

రాయవరం: క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం అన్ని చర్చిల్లోనూ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభువైన ఏసుక్రీస్తు సందేశమే శాంతి మార్గమని పలువురు పాస్టర్లు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. రాయవరం అపోస్థలిక్ చర్చి పాస్టర్ గొడుగు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రాయవరం చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, పాస్టర్ బ్రదర్ జోయల్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు ప్రత్యేక క్రైస్తవ గీతాలు ఆలపించడమే గాకుండా నాటికలు ప్రదర్శించారు. ఆదివారం రాత్రి నుంచే చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేయడంతో పాటు కొవ్వొత్తులతో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యుద్దీపాలంకరణతో పలు చర్చిలు కళకళలాడాయి. మండలంలోని రాయవరం, లొల్ల, వెదురుపాక, వి.సావరం, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: మానవాళి ఐక్యతకు క్రిస్మస్ వేడుక ప్రతీకగా నిలుస్తుందని సోమవారం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ ప్రబోధకులు అన్నారు. మండలంలోని 19 గ్రామాల చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టేకి, తాతపూడి, వెదురుమూడి, కపిలేశ్వరపురం, అంగర, వల్లూరు, కోరుమిల్లిలలోని బాప్టిస్టు, పెంతెకోస్తు, పడమర ఖండ్రిక, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, కాలేరు, వాకతిప్ప, నల్లూరు, అచ్యుతాపురం, నాగులచెరువు, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని చర్చిల్లో నిర్వహించిన వేడుకల్లో క్రైస్తవ గాయకులు భక్తిగీతాలను ఆలపించారు. శాంతి సందేశాన్ని వినిపించారు. ప్రపంచ శాంతికోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బైబిల్‌లోని ఘట్టాలపై కళా ప్రదర్శనలిచ్చారు. చర్చిలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

నేటి నుంచి ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'

రాయవరం: మండల పరిషత్ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. అన్ని సచివాలయాల వద్ద మధ్యాహ్నం 12 గంటలకు ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో యువతీ యువకులు పోటీ పడతారన్నారు. ఇప్పటికే ఐదు క్రీడాంశాల్లో పాల్గొనే యువతీ యువకుల జట్లను సచివాలయాల వారీగా జాబితాలు రూపొందించామన్నారు. ఈ నెల 26 నుంచి జనవరి 9వ తేదీ వరకు సచివాలయ స్థాయి, జనవరి 10 నుంచి 23 వరకు మండల స్థాయిలో, జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5వ వరకు జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ చేతుల మీదుగా లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో నరేంద్రరెడ్డి తెలిపారు.

సిద్ధమైన గ్రామాలు

రామచంద్రపురం రూరల్: నేటి నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాలకు మండలంలోని గ్రామాలు సిద్ధమయ్యాయి. ఈ నెల 26 నుంచి జనవరి 9 వరకు గ్రామ సచివాలయాల స్థాయిలోను, జనవరి 10 నుంచి 23 వరకు మండల స్థాయిలోను, 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయిలోను, జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జిల్లా స్థాయిలోను, ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్న నేపథ్యంలో నేటి ఉదయం 9 గంటలకు ద్రాక్షారామ పీవీఆర్ విద్యా సంస్థల క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఈ పోటీలను ప్రారంభించనున్నారు. దీనికోసం క్రీడా ప్రాంగణంలో సోమవారం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, వ్యాయామోపాధ్యాయులు గెద్దం అనురాధ, ఆని శ్రీనివాస్, కోశెట్టి శ్రీనివాస్, ఎ.ఉమ, సీహెచ్ సుజాతలు క్రికెట్, షటిల్, కబడ్డీ తదితర క్రీడా పోటీలకు కోర్టులను సిద్ధం చేశారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



ద్రాక్షారామలో దుస్తులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రపురం రూరల్: దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి పురస్కరించుకుని బీజేపీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సాకా బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ద్రాక్షారామ గీతా మందిరంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెయ్యల రాంబాబులు మాట్లాడుతూ భారతరత్న వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెన్నపు ధనరాజు, ఆకేటి శ్రీకృష్ణ, కొట్టువాడ హరిబాబు, దొంతంశెట్టి ఓం ప్రకాశ్, కోటేశ్వరరావు, శేఖర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటిపల్లిలో..

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో సోమవారం మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జ్ కర్రి చిట్టిబాబు పాల్గొని మాట్లాడుతూ డిసెంబర్ 25న కేంద్ర ప్రభుత్వం సుపరిపాలనా దినంగా ప్రకటించిందని ప్రతి సంవత్సరం వాజ్‌పేయి జయంతిని సుపరిపాలనదినంగా జరుపుకుంటున్నామన్నారు. జయంతి సందర్భంగా పంచాయతీ కార్మికులు, పేదలకు బట్టలు పంపిణీ చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంచారు. మండల అధ్యక్షుడు అవసరాల వెంకట రమణమూర్తి, జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, రామచంద్రపురం రూరల్ అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ, నాయకురాలు కోడూరి జయలక్ష్మి, దంగేటి మాచరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి స్నేహితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: కిడ్నీ, లివర్ పాడై అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.16,500 నగదు సాయం అందజేశారు. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన మాధవశర్మ వయస్సు 28 సంవత్సరాలు పౌరోహిత్యం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ప్రస్తుతం ఇతని ఆరోగ్యం క్షీణించి కిడ్నీలు లివర్ పాడైపోయాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయాయి, డెంగీ ఫీవర్, కామెర్లతో ఆరోగ్యం క్షీణించింది. వైద్యం చేయించుకునే పరిస్థితి లేకపోవడంతో ఇతని ఫ్రెండ్స్ అందరినీ సహాయం కోరుతూ వైద్యం చేయిస్తున్నారు. స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థను సహాయం చేయమని కోరడంతో రావులపాలెంలో మాధవ శర్మ స్నేహితుడు మణికంఠకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.16,500 నగదు అందజేశారు.

108లో ప్రసవం

మామిడికుదురు: పెదపట్నం గ్రామానికి చెందిన హైమావతి అనే గర్భిణికి పురుటి నొప్పులు రావడంతో సోమవారం 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. హైమావతికి నొప్పులు తీవ్రం కావడంతో 108లోనే డెలివరీ చేశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం వారిని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లామని ఎమర్జెన్సీ టెక్నీషియన్ సత్తెంశెట్టి రాము తెలిపారు. స్థానికులు 108 సిబ్బంది రాముతో పాటు పైలట్ నాగరాజును అభినందిచారు.

మనుధర్మం కాదు సమతా రాజ్యం కావాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న నేతలు

రామచంద్రపురం: మనుస్మృతి దహన దినోత్సవాన్ని మానవ హక్కుల దినోత్సవంగా ఘనంగా జరుపుకొంది. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా స్థానిక మెయిన్‌రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొని మనుధర్మశాస్త్రం విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమ నిర్వాహకులు రచయిత పిల్లి రాంబాబు మాట్లాడుతూ 1927 డిసెంబర్‌లో అంబేడ్కర్ చేసిన మహద్ చెరువు పోరాట ఫలితమే భారతీయులకు మానవహక్కులు సిద్ధించాయన్నారు. రాజ్యాంగంలో ఫండమెంటల్ రూల్స్‌లో ఈ హక్కులను చేర్చారని ప్రపంచ దేశాలు వీటిని స్వీకరించామని పేర్కొన్నారు. రామచంద్రపురం మునిసిపల్ కౌన్సిల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి ఏం కోరుకున్నదో దానిని అంబేడ్కర్ సాధించపెట్టారని అన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు సభ్యులు షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఎస్సీ ఎస్టీ ఫెడరేషన్, బీఎస్పీ కార్యకర్తలు బుంగ రాజు, రాజకుమార్, శ్రీముఖ కాలేజ్ అధిపతి రమణ, జాన్‌రత్నం, ఇంత సుకుమార్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనగా కొండేపూడి భరత్‌కుమార్ ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

వరి సాగులో నారుమడి దశే కీలకం



కాజులూరులో నాణ్యమైన విత్తనాలతో ఏపుగా పెరుగుతున్న వెద చల్లిన వరి నారు

కాజులూరు: 'పైరు దృఢంగా పెరగాలంటే విత్తు బలంగా ఉండాలన్నది నానుడి' విత్తనం బలంగా లేకపోతే ఎన్ని ఎరువులు వేసినా పంట ఎదుగుదల, దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. నియోజకవర్గ గ్రామాల్లో రైతులు ప్రస్తుతం దాళ్వా దమ్ములు, నారుమడుల పనుల్లో బిజీగా ఉన్నారు. నారుపోసే ముందే విత్తనాల ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో 53 వేల ఎకరాల్లో వరి సాగవుతుండగా ఈ ఏడాది సుమారు 80 శాతం గ్రామాల్లో రైతులు ఎక్కువగా వెదజల్లు విధానాలను అవలంబిస్తుండగా అక్కడక్కడా కొందరు రైతులు నాట్లు వేసే విధానాన్ని అవలంబిస్తున్నారన్నారు. నారుమడుల విధానంలో మొలక శాతం తకువగా ఉన్నట్లయితే నారుకొరత ఏర్పడుతుంది. వెదజల్లు విధానంలో మొలక శాతం తక్కువగా ఉన్నట్లయితే వరి మొక్కల మధ్య దూరం పెరిగి మరలా మధ్య, మధ్యలో నాట్లు వేసుకోవలసి వస్తుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు వరి విత్తనాల్లో మొలక శాతాన్ని పరిశీలించి విత్తనాలు చల్లుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

విత్తనాల నాణ్యత పరిశీలన



విత్తనాల నాణ్యతను రైతులు ఈ క్రింది విధంగా పరిశీలించాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచించారు. ముందుగా పలుచని గుడ్డ, లేదా దళసరి టిష్యూ పేపర్‌ని తీసుకుని మడతలు, మడతలుగా వేసి, 100 వరి విత్తన గింజలను తీసుకుని మడతల మధ్య ఉంచి దానిని 24 గంటలు పూర్తిగా నీటిలో నానబెట్టాలన్నారు. తర్వాత పైకి తీసి 24 గంటలు పొడిగా ఉండే గుడ్డా లేదా గడ్డితో కప్పి మండీ కట్టి ఐదు రోజుల తర్వత మొలక శాతాన్ని లెక్క కట్టాలన్నారు. 80 గింజలు తక్కువ కాకుండా మొలకెత్తినట్లయితే అవి నాణ్యమైనట్టుగా గుర్తించి మొత్తం విత్తనాలను నానబెట్టుకోవచ్చన్నారు. రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారానే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు.

వి.అశోక్, మండల వ్యవసాయాధికారి

అర్చకుడు మాధవకు ఎమ్మెల్యే సాయం



రాజమహేంద్రవరం ఆస్పత్రిలో మాధవను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పలివెల గ్రామ వలంటీర్ రావి మాధవానంద స్వామి (మాధవ)ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. కొత్తపేట మండలం పలివెలలో నిరుపేద కుటుంబానికి చెందిన మాధవ అర్చకుల వద్ద సహాయకుడిగా, గ్రామ వలంటీర్ పనిచేస్తూ కుటుంబ పోషణకు దోహదపడుతున్నాడు. అతను కిడ్నీ, లివరు సంబంధిత వ్యాధులకు గురై బాధపడుతూ రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆస్పత్రికి వెళ్లి మాధవను పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మాధవ అనారోగ్య పరిస్థితిని గురించి ఆరా తీశారు. మాధవ అనారోగ్య పరిస్థితిపై ఆందోళన పడవద్దని కోలుకుని సంపూర్ణ ఆరోగ్యవంతుడవుతాడని మాధవ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40 వేలు సాయం అందజేశారు. జగ్గిరెడ్డి వెంట కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి నాగిరెడ్డి పాల్గొన్నారు.